క్లుప్తంగా

నేడు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

కొత్తపల్లి: మిషన్ భగీరథ నీటి సరఫరాను బుధవారం నిలిపేయనున్నట్లు మిషన్‌భగీరథ ఏఈ నరేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుసుమహద్‌పల్లి వాటర్ ట్యాంక్ క్లీనింగ్ చేస్తుండటంతో కోస్గి, గుండుమాల్, కోత్తపల్లి, మద్దూర్ మండలాల పరిధిలోని గ్రామాలకు మిషన్ భగీరథ నీరు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సరఫరా నిలిపేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోస్గి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ యజమానిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు. గుండుమాల్ గ్రామానికి చెందిన దండు కృష్ణ బుధవారం తెల్లవారుజామున గుండుమాల్ వాగు నుంచి అక్రమంగా ఇసుకను కోస్గికి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో కాపుకాచి పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమాని దండు కృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం



ఊట్కూరు: మహిళ అదృశ్యమైన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణంరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అవుసలోనిపల్లి గ్రామానికి చెందిన రామచంద్రయ్య భార్య ఎస్ గజలమ్మ(60) గత ఆరు నెలలుగా మతిస్థిమితం కోల్పోయి ఇంట్లోనే ఉండేది. రెండు రోజుల క్రితం ఆమె ఇంటి నుంచి వెళ్లి పోయింది. తిరిగి ఇంటికి ఇంటికి రాకపోవడంతో ఆమె కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాణ స్వీకారానికి తరలిరండి

మాగనూర్: భారతీయ జనతా పార్టీ నూతన జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ ప్రమాణ స్వీకారం బుధవారం ఉదయం 10 గంటలకు మెట్రో ఫంక్షన్ హాల్ నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉంటుందని, ఉమ్మడి మాగనూర్, కృష్ణ మండలాల బీజేపీ అధ్యక్షుడు నల్లె నర్సప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, ఖైరతాబాద్ మాజీ శాసనసభ్యులు చింతల రాంచంద్రారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఉమ్మడి మండలంలోని బీజేపీ బూత్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కొత్తపల్లి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ కొడంగల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కొత్తపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌లో జరగబోయే రజతోత్సవ వేడుకలకు భారీ సంఖ్యలో బయలుదేరేందుకు సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి మండల బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు మోక్షమెప్పుడో?



నర్వ: మండలానికి మంజూరైన జూనియర్ కళాశాల పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం నర్వలో విలేకరులతో మాట్లాడుతూ.. మండలానికి జూనియర్ కళాశాల కోసం జాంద్రా గుట్ట వద్ద స్థలం కేటాయించి, ఇందుకోసం రూ.40 లక్షలు చదునుకు మంజూరైనట్లు గతంలో చెప్పారు, కానీ ఇంతవరకు పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. మండలంలో కొన్నేళ్లుగా కళాశాల లేక పోవడంతో పేద విద్యార్థులు చదువు మధ్యలోనే మానేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో మండలానికి మంజూరైన కళాశాల నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించి వచ్చే విద్యా సంవత్సరానికి ప్రారంభమయ్యేటట్లు చేయాలని వారు కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ శివన్న, రాజారెడ్డి, ఎల్లంపల్లి నాగరాజు, దండు అజయ్, కావలి కృష్ణ, షఫీ తదితరులు ఉన్నారు.

పత్తాలేని 'ప్రత్యేక' అధికారులు



మాగనూర్ మండలం లింగంపల్లి గ్రామ పంచాయతీ

- కార్యదర్శులపై పనిభారం
- అప్పులతో గ్రామాల్లో పనులు
- గ్రామాల్లో నత్తనడకన పారిశుద్ధ్యం పనులు
- చేతులెత్తేసిన అధికారులు

మక్తల్: గ్రామాల్లో సర్పంచుల పదవీ కాలం ముగిశాక ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. వారికి విధులు, నిధుల కేటాయింపు విషయంలో స్పష్టత లేకపోవడంతో పల్లె పాలన పడకేసింది. దీంతో గ్రామ పంచాయతీల ఖాతాలు ఖాళీ అయ్యాయి. కనీసం కరెంట్ బల్బులు, బోరు మరమ్మతులు, ట్రాక్టర్‌కు డీజిల్ రౌనలేని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు నాలుగు నెలల జీతాలుగా జీతాలు రావడం లేదు. ఈ భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. ఉదయం 7గంటల నుంచి విధుల్లో చేరితే రాత్రి 10గంటలైన పనులు పూర్తి కావడంలేదు. వాటితో పాటు ఉపాధి హామీ పథకం నిర్వహణ, ప్రజాపాలన పన్ను వసూలు, జనన, మరణాల పేర్లు నమోదు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, ధ్రువపత్రాలు తదితర పనులు తోడుకావడంతో పంచాయతీ కార్యదర్శులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఉదయం 7 గంటలకే పారిశుధ్య ట్రాక్టర్ డ్రైవర్ సెల్ఫీ తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. 10గంటల లోపే డీఎస్ఆర్ పూర్తి చేయాలనే నిబంధన కార్యదర్శులకు తలనొప్పిగా మారింది. నారాయణపేట జిల్లాలో 280 గ్రామ పంచాయతీలు, 13 మండలాలు ప్రతి గ్రామానికి పంచాయతీ కార్యదర్శులను నియమించింది. గత ఏడాది జనవరి 31వ తేదీలో సర్పంచుల పదవీ కాలం ముగిసింది. ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యేక పాలన మొదలైంది. క్లస్టర్ గ్రామాలుగా ఎంపిక చేసి 280 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రత్యేక అధికారులకు నిధులు, విధులపై స్పష్టత లేకపోవడంతో గ్రామాలకు రానుపోను సరిపోయింది. ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు అప్పులు చేసి కనీస అవసరాలు తీర్చేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పెద్ద గ్రామపంచాయతీల్లో పరిస్థితి అధ్వానంగా తయారైంది. గ్రామ పంచాయతీల్లో పన్ను వసూలు, నీరు, ఇంటి పన్ను వసూలు చేసి గ్రామాల్లో పనులు చేస్తున్నారు.

తప్పని తిప్పలు

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం ఇచ్చే నిధులు ముఖ్యమైన ఆర్థిక ఆధారాలు కాగా, 2022 ఆగస్టు నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు రావడం లేదు. జనాభాకు అనుగుణంగా ఒక్కొక్కరికి రూ.812 చొప్పున 15వ ఆర్థిక సంఘం నిధలు మంజూరు చేస్తుంది. ప్రత్యేక పాలన ప్రారంభమైనప్పటి నుంచి నిధులు రావడం లేదు. పెద్ద పంచాయతీల్లో ఇంటి పన్ను, తైబజార్, ఇంటి నిర్మాణ ఫీజులు, వ్యాపార వాణిజ్యాల లైసెన్స్ ఫీజులతో పంచాయతీల్లో డబ్బు జమ చేసుకుంటున్నారు. చిన్న గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్స్, ఇతర అధారాలు లేవు. దీంతో పంచాయతీ నిర్వహణకు నాలుగు నెలల కాలంలో రూ.30 వేల నుంచి రూ.40వేల వరకు అప్పులు చేస్తున్నారు. గతంలో చెత్తసేకరణకు కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ఆటోలు, సంబంధిత పంచాయతీ కార్యదర్శుల పేరిట రిజిస్ట్రేషన్ అయ్యాయి. నెల కిస్తు కట్టకపోతే వారి సొంత బ్యాంకు ఖాతాలకు సంబంధించిన సివిల్ కోర్ పడిపోతుందని సంబంధిత కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శులు ఉన్నతాధికారుల దగ్గర తమ సమస్యలు తెలిపినా ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ ఎన్నికల జరిగే వరకు పంచాయతీ పాలన ప్రశ్నార్థకంగా మారింది.

సమస్యలు పేరుకుపోతున్నాయ్..



గ్రామాల్లో సమస్యలు పెరిగి పోతున్నాయి. అ ధికారులు గ్రామాలకు సక్రమంగా రావడం లేదు. తాగునీటి ఇబ్బందులు, కరెంటు సమస్యలు, రోడ్ల మరమ్మతు వంటి పనులు చేయడంలేదు. విద్యుత్ బల్బులు లేక రాత్రి సమయంలో చీకటి మయంగా మారుతోంది. కార్యదర్శులపై భారం అధికం కావడంతో ఇబ్బంది కరంగా మారుతోంది. డబ్బుతో కూడిన పని అంటగట్టడంతో కార్యదర్శులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

– మహేష్‌గౌడ్, జక్లేర్

చర్యలు తీసుకుంటాం..

గ్రామాల్లో సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం. వేసవికాలం కావడంతో తాగు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండేందుకు చర్యయలు తీసుకుంటాం.

– రమేష్, ఎంపీడీఓ, మక్తల్

విద్యతోనే బంగారు భవిష్యత్



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

- ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట/నారాయణపేట ఎడ్యుకేషన్: విద్యతోనే బంగారు భవిష్యత్ సాధించవచ్చని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆమె జిల్లా కేంద్రంలోని స్థానిక చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవం, స్పోర్ట్స్‌డేలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు వార్షికోత్సవం సందర్భంగా రకరకాల క్రీడలు ని ర్వహించి, వారిని క్రీడా రంగంలో ప్రోత్సహించడం ద్వారా వా రిలో శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యను అందిస్తూ అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించేలా కృషి చేయాలన్నారు. అనంతరం క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి సుదర్శన్‌రావ్, కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ వసంత, లెక్చరర్ల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బాటసారులకు చలివేంద్రం ఎంతో ఉపయోగం

వేసవికాలంలో బాటసారుల దాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. కాకర్ల సురేష్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ దగ్గర చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహం తీర్చేందుకు 17 ఏళ్లుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు కాకర్ల భీమయ్యను అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఆర్.శివారెడ్డి, వైస్‌చైర్మన్ కొనంగేరి హన్మంతు, ఆర్టీఏ జిల్లా మెంబర్ పోషల్ రాజేశ్, మార్కెట్ మాజీ చైర్మన్లు సుధాకర్, సరాఫ్ నాగరాజు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సలీం పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగ చేసుకోవాలి

దామరగిద్ద: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి అన్నారు. మండలంలోని నర్సాపూర్, మల్‌రెడ్డిపల్లి, గ్రామాల్లో సెర్ప్, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ మొగులప్ప, విండో అధ్యక్షుడు ఈదప్ప, మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చదువు తో సమాజానికి మేలు



విద్యార్థికి ప్రశంసాపత్రం అందిసున్న బండ ప్రకాష్, ఎమ్మెల్యే శ్రీహరి

- శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్

కృష్ణా: మనం మన పిల్లలకు సంస్కారవంతమైన చదువులను అందించినప్పుడే సమాజంతో పాటు మనం బాగుంటామని శాసన మండలి వైస్ చైర్మన్ బండప్రకాష్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మండలంలోని గుడెబల్లూర్ గ్రామంలో మార్గదర్శి పాఠశాల వార్షికోత్సవ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం చదువుకున్న విలువ మరే దానికి లేదని, చదువును ఎవరూ దొంగలించలేరని అది ఉంటే మనిషికి ఎక్కడైన గౌరవం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నర్సింహులు ,ప్రహ్లాద్‌రెడ్డి,ప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ భీంరెడ్డి, పూజారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత పాటించాలి



శేర్నపల్లి పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈఓ



కోస్గి పాఠశాలలో విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని ఎంఈఓ బాలాజీ అన్నారు. మండలంలోని శేర్నపల్లి యూపీఎస్ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల సంఖ్య, హాజరును పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో మాట్లాడారు. విద్యార్థులతో పాటు భోజనం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు జనార్దన్, టీచర్లు అశోక్, వెంకటప్ప, స్వప్న, వెంకటేష్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీ

కోస్గిరూరల్: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం తాజా కూరగాయలతో నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. బాలికల ఉన్నత పాఠశాలలో ఫిర్యాదుల పెట్టెను ప్రారంభించారు. విద్యార్థులతో పాటు తహసీల్దార్ భోజనం చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. కా ర్యక్రమంలో ఆర్ఐ సుభాష్ ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

మక్తల్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని మక్తల్ ఎంపీడీఓ రమేష్ అన్నారు. మక్తల్ మండలం సంగంబండ దగ్గర ఉన్న సాంఘిక సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన భోజనం పరిశీలించారు. అనంతరం దాసర్పల్లిలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. వనాయికుంటల్లో నర్సరీలను పరిశీలించారు. పనులను ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉండాలి



అప్పిరెడ్డిపల్లి పాఠశాలలో హర్యానా వేషధారణలో చిన్నారులు

నారాయణపేట రూరల్: భిన్నత్వంలో ఏకత్వాన్ని కలిగి ఉండాలని, ఈ విషయాన్ని విద్యార్థులకు ప్రాక్టికల్‌గా తెలియజేసినట్లు ప్రధానోపాధ్యాయులు గోపాలకృష్ణ తెలిపారు. మండలంలోని అప్పిరెడ్డిపల్లి యూపీఎస్‌లో ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హర్యానాతో పాటు వివిధ ప్రాంతాల సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేశారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రజల వేషధారణ, ఆహార అలవాట్లు, పండగల నిర్వహణ, మాట్లాడే భాషలు, సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజీ కాంబ్లే, జగదీష్, ఆండాళ్, ఆదిత్య పాల్గొన్నారు.

ఘనంగా మారెమవ్వ బోనాలు

మాగనూర్: మండలంలోని బైరంపల్లి గ్రామంలో గ్రామ దేవత మారెమవ్వ బోనాల పండుగ మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో బోనాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల



కృష్ణా: మండలంలోని చేగుంట పార్వతి పరమేశ్వర బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం తహసీల్దార్ వెంకటేష్ తన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర సందర్భంగా భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిర్వహకులకు సూచించారు. ఇందులో ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, చేగుంట గ్రామానికి చెందిన ప్రముఖులు విజప్పగౌడ, వీరేంద్ర పాటిల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజప్పగౌడ పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

మాగనూర్: మండలంలోని పర్మన్‌దొడ్డి మండల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ మురళీధర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హుస్సేన్, ఉపాధ్యాయులు బలరాం, వెంకటయ్య, శ్రీనివాసులు, పార్వతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కున్సీలో ఎడ్లబండ్ల గిరక పోటీలు



కృష్ణా: మండలంలోని కున్సీ గ్రామంలో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామ నాయకులు మంగళవారం ఎడ్లబండ్ల గిరక పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన రైతులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నర్సప్ప మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో రైతులను ఉత్సాహ పరిచేందుకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు శరణగౌడ, విజయగౌడ, అంజప్పగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వసంత నవరాత్రి ఉత్సవాలు

ఊట్కూరు: బిజ్వార్‌లోని అంభత్రయ క్షేత్రంలో మంగళవారం ఘనంగా వసంత నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. 9 రోజులుగా ఆదిత్య పరాశ్రీ ఆధ్వర్యంలో ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. 9 రోజుల పాటు అమ్మవారికి వివిధ రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు, చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య పరాశ్రీ మాట్లాడుతూ లోక కల్యాణం కోసం ఏడాదికి రెండుసార్లు నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆరోగ్య సంరక్షణకే సన్నబియ్యం



జక్కన్నపల్లిలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు



తీలేర్‌లో లబ్ధిదారుడి ఇంట్లో సన్నబియ్యం భోజనం చేస్తున్న డీసీసీ అధ్యక్షులు, అధికారులు

నర్వ: నిరుపేదల ఆరోగ్య సంరక్షణకే సన్నబియ్యం పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకొచ్చారని కాంగ్రెస్ మండల అధ్యక్షులు చెన్నయ్యసాగర్ అన్నారు. జక్కన్నపల్లి, పెద్దకడ్మూర్ గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. పెద్దకడ్మూర్‌లో తహసీల్దార్ మల్లారెడ్డి, జక్కన్నపల్లిలో ఆర్ఐ ఆశాబీ రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, శరణప్ప, రవీందర్‌రెడ్డి, కడ్మూర్ శ్రీనివాస్‌రెడ్డి, రామన్‌గౌడ్, సంజీవరెడ్డి, అశోక్‌గౌడ్, గడ్డం నర్సింహులు, నాగిరెడ్డి, జక్కన్నపల్లి నర్సింహ, సత్యన్న ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పథకం సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అల్లీపూర్ మాజీ సర్పంచ్ కొత్తమాలె రమేశ్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదల కళ్లలో ఆనందం చూస్తున్నాం

మరికల్: రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయడంతో పేదల కళ్లలో ఆనందం చూస్తున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని తీలేర్, అప్పంపల్లి గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ అనిల్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం తీలేర్‌లో లబ్ధిదారుడి ఇంట్లో సన్నబియ్యం భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్ రెడ్డి, సూర్యమోహన్‌రెడ్డి, రేవతమ్మ, తిరుపతిరెడ్డి, రవి, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యపై అవగాహన

కోస్గి రూరల్: కార్పొరేట్ విద్యకు దీటుగా ఉద్యోగ అవకాశాలు పొందెందుకు పాలిటెక్నిక్ విద్య ఎంతో ఉన్నత మైందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు పలు కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్య అవకాశాలు పొందెందుకు కోర్సులు ఉపయోగపడతాయన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం ఆరు కళాశాలలున్నాయన్నారు. సివిల్, మెకానిల్, ఎలక్ట్రానిక్ కోర్సులపై, ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ వసతులు తదితర అంశాలపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వసుధరాణి, ఉదయ్‌కుమార్, ఉమాశంకర్, తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి



మక్తల్‌లో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ ఎంఎల్ నాయకుల నిరసన

మక్తల్/ఊట్కూర్: ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా, పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాని మంగళవారం అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు కిరణ్ మా ట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చి హామీలు తుంగలో తొక్కిందన్నారు. కులమతా ల మధ్య చిచ్చుపెట్టి కాలయాపన చేస్తోందన్నారు. జిల్లా కార్యదర్శి భగవంతు, టీ యూసీ జిల్లా ఉపాధ్యక్షుడు భుట్టో, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్, గోపాల్ పాల్గొన్నారు.

- ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు ఉపసంహరించుకోవాలని సీపీఐఎంఎల్ జి ల్లా నాయకులు సలీం డిమాండ్ చేశారు. ఊట్కూరులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం వల్ల సా మాన్య ప్రజలపై భారం పడుతుందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చే స్తామని అన్నారు. కనుక రాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



పెంచిన గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలని సీపీఐ ఎంఎల్ నాయకుల నిరసన

పెంచిన గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలి

మద్దూరు: పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలని పాత బస్టాండ్ చౌరస్తాలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ నాయకులు కొండా నర్సింహులు మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలు పేదరికంలో ఉంటే అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజప్ప, హన్మంతు, కాశప్ప, అంబటి పాల్గొన్నారు.